క్లుప్తంగా

అటవీ సంరక్షణకు కృషి చేయాలి



అటవీ క్షేత్రంలో సూచనలిస్తున్న డీఎఫ్‌వో

రాయికల్: అటవీ సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని చింతలూరు, వస్తాపూర్, బోర్నపల్లిలో మంగళవారం అటవీ ప్రాంతాన్ని సందర్శించి మాట్లాడారు. అటవీ సంపద పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా ఎండాకాలంలో వన్యప్రాణులు దాహం కోసం అడవుల్లోకి వస్తాయని, వాటి తాగునీటి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఎఫ్‌ఆర్వో భూమేశ్, డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ చంద్రమౌళి, సెక్షన్ ఆఫీసర్ మల్లయ్య, విజయ్‌కుమార్, బీట్ ఆఫీసర్ రవీందర్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఎల్ఐసీ కాలనీ వాసులు

కోరుట్ల: పట్టణంలోని 29వ వార్డు ఎల్ఐసీ కాలనీలో రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు మంగళవారం కమిషనర్ రాజేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం అంతర్గత రోడ్లను తవ్వి పైప్‌లైన్ వేయటంతో ఆ గుంతలతో ద్విచక్ర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, దెబ్బతిన్న సీసీ రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి శికారి గోపీ కృష్ణ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే మెరుగైన విద్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జగిత్యాల: ప్రభుత్వ కళాశాలలోనే మెరుగైన విద్య లభిస్తుందని విద్యార్థినులు కళాశాలలో చేరి ప్రగతికి బాటలు వేసుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. కళాశాలలో మంగళవారం అధ్యాపకులు ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులంతా డిగ్రీ కళాశాలలో చేరి అడ్మిషన్లు పొందాలని సూచించారు. అధ్యాపకులు కరపత్రాలతో ప్రచారం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి



గుంతలు తీస్తున్న కూలీలు

సారంగాపూర్: ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో రాజేందర్ అన్నారు.సారంగాపూర్‌లో ఉపాధిహామీ కింద రైతులు ఏర్పాటు చేస్తున్న మామిడి మొక్కల పెంపకం కోసం కూలీలు గుంతలు తీసే పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతి గ్రామం నుండి రోజు 100 మందికిపైగా కూలీల్లో పాల్గొనేలా సిబ్బంది కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్సారెస్పీ ఫీడర్ చానళ్లు, ఫీల్డ్‌చానళ్లలో చెత్త, పిచ్చి మొక్కలు తొలగించే పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి లైశెట్టి శేఖర్, టీఏ లత, శివ ఉన్నారు.

'నిబంధనలు పాటించడం లేదు'

జగిత్యాల: మున్సిపల్‌కు చెందిన టౌన్ హాల్‌లో లీజు విషయంలో నిబంధనలు తుంగలో తొక్కుతున్నారని 35వ వార్డు కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. టౌన్ హాల్ లీజు అగ్రిమెంట్ సమయంలోనే వివాదాలు చోటుచేసుకున్నాయని, లీజు పొందిన నిర్వాహకులు ఇష్టానుసారంగా ఫ్లోరింగ్ తవ్వడం, కిటికీలు కూడా ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, అగ్రిమెంట్ రూల్స్‌ను అతిక్రమించినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. వెంటనే లీజు రద్దు చేసి టౌన్‌హాల్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరారు.

కులవృత్తుల అభ్యున్నతికి కృషి చేశాం

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాలరూరల్: బీఆర్ఎస్ హయాంలో కులవృత్తుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. చల్‌గల్ గ్రామంలోని రేణుక ఎల్లమ్మతల్లి బోనాలు, పట్నాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ అన్ని కుల వృత్తుల వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారన్నారు. హరితహారంలో తాటి, ఈతమొక్కలు నాటడం, ద్వారా గౌడ కులస్తులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఏల్ల గంగనర్సు, నాయకులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యేకు వినతి

జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం ఎస్సీ మాల అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు అంబేడ్కర్ సంఘం భవనానికి స్థలం ఇప్పించాలని మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

జగిత్యాలరూరల్/జగిత్యాలటౌన్/ పెగడపల్లి/ మెట్‌పల్లి/మల్యాల/వెల్గటూర్ /మల్లాపూర్/ గొల్లపల్లి/ధర్మపురి: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోవాలని రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం జగిత్యాలలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అసభ్య పదజాలంతో దూషించిన బాల్క సుమన్ తీరు సరికాదన్నారు.

రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ధర రమేశ్ బాబు ఫిర్యాదు చేశారు.

బాల్క సుమన్‌పై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి అన్నారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి పట్టణ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ దిష్టిబొమ్మను యూత్ కాంగ్రెస్ నాయకులు పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద మంగళవారం దహనం చేశారు. మల్యాలలో వెల్గటూర్



మల్యాలలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్ననాయకులు

అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. దహనం చేశారు. మల్లాపూర్ భరతమాత కూడలి వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుండ్ర శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాల్క సుమన్ వ్యాఖ్యలపై ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకేటి నారాయణరెడ్డి, ప్యాక్స్ మాజీ చైర్మన్ క్యాతం మల్లారెడ్డి, డైరెక్టర్ పుండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

గొల్లపల్లి: సీఎం రేవంత్ రెడ్డిని అవమాన పరుస్తూ ,అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై గొలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నరేశ్‌కు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు.

ఏ కష్టమొచ్చినా.. మీ వెంటే ఉంటా

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

ఇబ్రహీంపట్నం: ఏ కష్టం వచ్చినా మీ వెంటే ఉంటానని.. ప్రజలే నాకు శక్తి అని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గుడ్ మార్నింగ్ కోరుట్లలో భాగంగా మండలంలోని కోమటికొండాపూర్‌లో మంగళవారం పర్యటించారు. గ్రామంలో పర్యటించి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లపై అక్కడక్కడ ఉన్న మిషన్ భగీరథ లీకేజీలను చూసి వెంటనే లికేజీల మరమ్మతులు చెప్పించాలని గ్రామప్రత్యేకాధికారి, ఎంపీడీవో ప్రభుకు ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి ప్రభు, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ జలేశ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఏతులు అఖిల్, అరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్లాపూర్: మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ రుద్ర రాంప్రసాద్ తండ్రి బుచ్చిరాజం ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

కోరుట్ల: ఇంగ్లిష్ బాగా మాట్లాడితే మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇంగ్లిష్ భాషతో ప్రపంచంలో ఎక్కడైనా మంచి ఉద్యోగం సంపాదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



కోమటి కొండాపూర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

సీనియర్ సిటిజన్లకు అండగా ఉంటా..

సీనియర్ సిటిజన్లకు అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ డివిజన్ కార్యాలయంను మంగళవారం ప్రారంభించారు. అనంతరం 2024 డైరీ, క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సీనియర్ సిటీజన్ల పిలుపు అనే ప్రత్యేక పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం, అసోసియేట్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

నేరరహిత గ్రామాలుగా తీర్చిదిద్దడంలో సహకరించాలి

మల్యాల: యువత ఉన్నత చదవాలని, చెడు మార్గంలో నడవకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, గ్రామాల్లో నేరాలను తగ్గించేందుకు, నేరరహిత గ్రామాలు తీర్చిదిద్దడంతో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మల్యాల సీఐ దామోదర్‌రెడ్డి అన్నారు. మల్యాలలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో సామాజిక రుగ్మతలపై కళాజాత నిర్వహించారు. సీఐ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తామని, సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని అన్నారు. యువత చెడుదారిన నడవకుండ తల్లిదండ్రుల తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు ఫోన్ చేసి, పోలీసుల సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై కుమారస్వామి, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్యాల సీఐ దామోదర్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరు

ధర్మపురి: కాంగ్రెస్ పార్టీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలెవ్వరు నమ్మరని గావ్ చలో ప్రవాసీ కార్యకర్త కుమార్ అన్నారు. మండలంలోని కమలాపూర్‌లో మంగళవారం నిర్వహించిన గావ్ చలో కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదంతో పేదల సంక్షేమం, దేశ అంతర్గత భద్రత మహిళా సాధికారిత కోసం కృషి చేస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం, కో–కన్వీనర్ బండారి లక్ష్మణ్, స్వచ్ఛ భారత్ రాష్ట్ర కన్వీనర్ మంచె రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌లో శ్రీ వెంకటలక్ష్మి నర్సింహా ఇండస్ట్రీస్ పేరుతో రైస్‌మిల్ నిర్మాణం పూర్తికాకుండానే ధాన్యం కేటాయించిన జిల్లా సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా సివిల్ సప్లై డిప్యూటి తహసీల్దార్ ఉమాపతిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారికి మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తిమ్మాపూర్ మాజీ ఉపసర్పంచ్ సల్ల సునీల్ తెలిపారు. రైస్‌మిల్ నిర్మాణం కాకుండానే 2200 టన్నుల ధాన్యాన్ని కేటాయించారని తెలిపారు. అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

దేశంలో పుట్టిన ప్రతి పౌరుడు హిందువే

మల్లాపూర్: దేశంలో పుట్టిన ప్రతి పౌరుడు హిందువుడే అని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి గజం రాజు అన్నారు. మండలంలోని గుండంపల్లిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో విశ్వహిందూ, బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని మాట్లాడారు. దేశంలోని పౌరులందరు సమానమేనని, హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి భారతీయుడు కృషి చేయాలని సూచించారు. అనంతరం గుండంపల్లి బజరంగ్‌దల్, విశ్వహిందూ పరిషత్ నూతన కమిటీని ప్రకటించారు. కార్యక్రమంలో బజరంగ్‌దల్ జిల్లా గోరక్ష ప్రముఖ్ పల్లికొండ వెంకటేశ్, విశ్వహిందూ, బజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీ వెళ్లిన ప్రభుత్వ విప్

ధర్మపురి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో తమ వాదనలు వినిపించడం కోసం రాష్ట్ర మంత్రి దామోదర రాజనరసింహాతో కలిసి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు కవ్వంపెల్లి సత్యనారాయణ, లక్ష్మీకాంతరావు తరలివెళ్లారు. ఏడుగురితో కూడిన న్యాయమూర్తుల బెంచ్ ముందు తమ వాదనలు వినిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున వెళ్లినట్లు విప్ పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన

జగిత్యాల: తమిళనాడులోని సేలంలో జనవరి 29 నుంచి 31 వరకు జరిగిన ఫస్ట్ ఫెడరేషన్ కప్ అండ్ నేషనల్ సబ్ జూనియర్ రెడ్ టెన్నిస్‌బాల్‌లో జగిత్యాల మానస స్కూల్‌కు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. విద్యార్థులు మణిహర్ష, సాయిప్రణవ్, శిశిర్‌చంద్ర, మహిమాన్విత్, సంకీర్త్, రిషిత్ గౌడ్, సుమంత్, ధీరజ్, కౌశల్, సిద్దార్థ, సుశ్వాంత్, విఘ్నేశ్, మణిచరణ్, శ్రీయాన్, అక్షయ్, గజేంద్ర టీంను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్ రావు, హరిచరణ్‌రావు పాల్గొన్నారు.

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని న్యూ హైస్కూల్ విద్యార్థిని పత్తి శ్రీజ కరాటే పోటీల్లో ఛాంపియన్ షిప్ సాధించింది. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన ఇండో–నేపాల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీజ పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది.ఈ సందర్భంగా మంగళవారం హెచ్ఎం బాపురెడ్డి, ఉపాధ్యాయులు కొక్కొండ చారీ, ఎనుగంటి వేణుగోపాల్, స్వామి, ఫణి భూషణ్, శ్రీలత, శ్యామల, యమున విద్యార్థినిని అభినందించారు.

పెండింగ్ డీఏ విడుదల చేయాలి

మల్లాపూర్: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండిం డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం(టీజీయూఎస్) జిల్లా అధ్యక్షుడు సునావత్ రాజు, ప్రధాన కార్యదర్శి జరుపుగల గోవింద్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నందున తమ సమస్యలపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయాలన్నారు. ఎంప్లాయి హెల్త్ స్కీంలో క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్‌పై ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చాలకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయాలని కోరారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

రాయికల్: విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే ఉన్నతస్థాయికి ఎదుగుతారని తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. రాయికల్ మండలం ఆలూరులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం గ్రామంలో మామిడితోటలో విహారయాత్రకు వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విహారయాత్రలతో విద్యార్థులకు చదువుతో పాటు, సృజనాత్మక శక్తి పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ వెంకటేశ్వర్‌రావు, రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కోసం విజ్ఞప్తి దీక్ష

ధర్మపురి: బీజేపీలో క్రియాశీల పాత్ర పోషించిన తనకు పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపెల్లి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని బీజేపీ నాయకుడు రాయిల్ల రవికుమార్ అధిష్టానాన్ని కోరారు. ధర్మపురి తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం విజ్ఞప్తి దీక్షను చేపట్టాడు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం రావాలని 2013లో ధర్మపురి నుంచి జమ్మూకాశ్మీర్ వరకు, 2019లో తెలంగాణ అన్ని జిల్లాలో సైకిల్‌యాత్ర చేపట్టానని తెలిపారు. తన లాంటి వ్యక్తికి అవకాశం కల్పించాలని కోరారు. దీక్ష శిబిరాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు చందోలి శ్రీనివాస్, తదితరులు ప్రారంభించారు.

క్రీడాకారులకు అండగా స్పోర్ట్స్‌క్లబ్

మల్లాపూర్ : క్రీడాకారులను ప్రోత్సాహించి వారికి అండగా నిలిచేందుకే స్పోర్ట్స్‌క్లబ్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు ఆల్ యూత్ అసోసియేషన్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గనవేని మల్లేష్ అన్నారు. మండలంలోని రేగుంటలో మంగళవారం యువజన సంఘాల నాయకులు, సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి ఆల్ యూత్ అసోసియేషన్, స్పోర్ట్స్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గనవేని మల్లేష్, ఉపాధ్యక్షుడిగా ఏలేటి శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వేములవాడ దేవరాజం, కోశాధికారిగా చెన్నూరి రమేష్, స్పోర్ట్స్ ఇన్‌చార్జీలు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా విద్యార్థుల వీడ్కోలు

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో మంగళవారం రాత్రి ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్. లత, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పత్తెం శ్రీనివాస్,ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర



శోభాయాత్రలో భక్తులు

జగిత్యాలటౌన్: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరగడంతో జిల్లా కేంద్రంలోని వాసవి గార్డెన్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న అఖండ హనుమాన్ చాలీసా అహోరాత్ర పారాయణ మహా యజ్ఞం మంగళవారం ప్రారంభమైంది. మార్కండేయ ఆలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా, టవర్ సర్కిల్, న్యూ బస్టాండ్ మీదుగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక బ్రహ్మ బాచంపెల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోటగిరి శ్రవణ్‌కుమార్, చెట్ల చంద్రశేఖర్, మార కైలాసం, బోనగిరి నారాయణ, తవుటు రాంచంద్రం పాల్గొన్నారు.

గీత కార్మికుల అభ్యున్నతికి కృషి

జగిత్యాలరూరల్: ప్రభుత్వం గీతకార్మికుల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. చల్‌గల్ రేణుకాఎల్లమ్మతల్లి ఆలయంలో నిర్వహిస్తున్న పట్నాలు, బోనాల జాతరలో మంగళవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో నాయకులు రాజేందర్, సురేశ్, పెండెం రాములు, సత్తన్న, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎస్సైల బదిలీలకు రంగం సిద్ధం

జగిత్యాలక్రైం: జిల్లాలో ఎస్సైల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో ఎమ్మెల్యేలు కూడా ఎస్సైల బదిలీలను కోరుకుంటున్నారు. ఈ క్రమంలో ఒకటి రెండు రోజుల్లోనే ఎస్సైలు బదిలీలు జరగనున్నట్లు సమాచారం.

సంక్షిప్త వార్తలు

ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడంపై హర్షం

మెట్‌పల్లి: కర్పూరి ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలో మంగళవారం నాయీ బ్రాహ్మణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చిట్యాల సత్యనారాయణ, పసునూరి రాజారాం, శ్రావణ్‌కుమార్, భూమయ్య, శంకర్ తదితరులున్నారు.

అడ్మిషన్లకు గడువు పెంపు

జగిత్యాల: జగిత్యాల ఖిలాగడ్డలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో అడ్మిషన్లకు దరఖాస్తు గడువు పొడగించినట్లు ప్రిన్సిపాల్ దాసరి రాజేందర్ తెలిపారు. 5,6,7 తరగతులతో పాటు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో అడ్మిషన్లకు దరఖాస్తుల గడువు తేదీ ఈనెల 15 వరకు పొడగించినట్లు పేర్కొన్నారు.

వికలాంగులకు రాయితీ ఐడెంటిడీ కార్డులు పంపిణీ

కోరుట్లరూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన 30 మంది వికలాంగులకు 50 శాతం రాయితీ బస్ పాసులను గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేశ్ గౌడ్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన మమత అదృశ్యమైనట్లు ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. గాంధీనగర్‌కు చెందిన బూర్ల శ్రీనివాస్, అతడి భార్య మమత మధ్య సోమవారం గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన మమత ఇంటి నుంచి వెళ్లిపోయింది. పలుచోట్ల వెతికినా ఆచూకి దొరకకపోవడంతో భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

జయ జయహే గీతం ఎంతో గొప్పది

జగిత్యాల: ప్రభుత్వం రాష్ట్ర అధికారిక గీతంగాజయ 'జయహే తెలంగాణ జననీ జయ కేతనం' గేయం ఆమోదం పొందడం ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గంగధరి మహేశ్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా కవి అందెశ్రీ కలం నుంచి జాలువారిన ఈ అత్యద్భుత గీతాన్ని ప్రభుత్వం గుర్తించడం శుభపరిణామమన్నారు.

యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా కవ్వం మధు

కొండగట్టు: జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ జనరల్ సెక్రటరీగా కొడిమ్యాల మండలం పూడూర్‌కు చెందిన కవ్వం మధును నియమించినట్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం నియామకపత్రం అందజేశారు.

విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించాలి

మెట్‌పల్లి: విద్యుత్ బిల్లుల చెల్లింపు విషయంలో వినియోగదారులు ఆన్‌లైన్ విధానాన్ని వినియోగించుకోవాలని ఏడీఈ మనోహర్ మంగళవారం కోరారు. డిజిటల్ చెల్లింపులతో అన్ని విధాలుగా ప్రయోజనం ఉందని, దీనిని వినియోగించుకోవడంపై దృష్టి సారించాలన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ఉండాలి

జగిత్యాల: విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లో ఉండాలని చైతన్య టెక్నో పాఠశాల ప్రిన్సిపాల్ సచిన్ అన్నారు. మంగళవారం తమిళనాడులోని సేలంలో జరిగిన థర్డ్ నేషనల్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.కార్యక్రమంలో పీఈటీలు కిశోర్, అజయ్‌కుమార్, పుష్పలత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ కు కృతజ్ఞతలు

ధర్మపురి :మండలంలోని ఆరెపెల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో బోరు వేయించి విద్యార్థులకు సౌకర్యాన్ని కల్పించిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. తాగునీరు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బోరు వేయించాలని కోరగా తక్షణం స్పందించి మంగళవారం పాఠశాలలో బోర్ వెల్‌ను వేయించారు.దీనికి విప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నల్లగొండలో ముగిసిన టెండర్లు

కొండగట్టు: కొడిమ్యాల మండలం నల్లగొండ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ జాతరకు సంబంధించిన టెండర్లను మంగళవారం ఈవో అనూష సమక్షంలో నిర్వహించారు. పట్టి నామాలు కోరమీసాలు వేములవాడకు చెందిన రాజు 1.51 లక్షలు కొబ్బరి ముక్కల సేకరణ నాచుపెల్లి గ్రామానికి చెందిన కోలకాని మల్లేశం రూ.35 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్, వ్యవస్థాపక ధర్మకర్త సత్యానారాయణ రావు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

పెగడపల్లి: అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయికి ఎంపికై పోటీలకు వెళ్లేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మండల కేంద్రానికి చెందిన క్రీడాకారుడు యోగేశ్‌కు పెగడపల్లి మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్ మంగళవారం రూ. 3 వేలు ఆర్థిక సాయం అందించారు.

ఉచిత వైద్య శిబిరం

జగిత్యాలరూరల్: మండలంలోని కల్లెడలో మంగళవారం జగిత్యాల హరిహర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని సుమారు 80 మందికి డాక్టర్ సుధీర్ చౌదరి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహేశ్వర్ రావు, ఎంపీటీసీ పర్శురాంగౌడ్, ఆస్పత్రి నిర్వాహకులు నక్క రమేశ్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

రాయికల్: మండలంలోని ఇటిక్యాల ఒడ్డెరకాలనీ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రూ.3 లక్షలు మంజూరు చేయగా మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాధ ఆదిరెడ్డి, తాజామాజీ సర్పంచ్ సామల్ల లావణ్య, సింగిల్ విండో చైర్మన్ మహిపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చివరి తేదీ 7

జగిత్యాల: ఇంటర్ వార్షిక పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 7 వరకు గడువు ఉందని ఇంటర్‌మీడియెట్ నోడల్ అధికారి నారాయణ తెలిపారు. ఇంకా ఫీజు చెల్లించని విద్యార్థులు రూ.4500 పెనాల్టీతో వార్షిక ఫీజు చెల్లించవచ్చని, విద్యార్థులు గమనించాలని పేర్కొన్నారు.

రెండో విడత ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

జగిత్యాల: జిల్లాలో ఇంటర్ రెండో విడత ప్రాక్టికల్స్ మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయని, ఉదయం జరిగిన జనరల్ విభాగంలో 397 మంది విద్యార్థులకు గాను 388 మంది హాజరు కాగా, 9 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 172 మందికి గాను 156 మంది హాజరు కాగా, 16 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన జనరల్ విభాగంలో 122 మందికి గాను 122 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌లో 103 మందికి గాను 92 మంది హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరయ్యారు.

సెల్‌ఫోన్ రిపేరింగ్‌కు ఉచిత శిక్షణ

రాయికల్: పట్టణంలోని చిన్నజీయర్‌స్వామి ట్రస్ట్ భవనంలో జీఎంఆర్ వరలక్ష్మి, ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ రిపేరింగ్‌కు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసి 18–30 ఏళ్ల లోపు ఉన్న యువకులు అర్హులని, ఈనెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 99633 47142 సంప్రదించాలని కోరారు.

నాగాలయంలో వేలం పాట

రాయికల్: మండలంలోని కొత్తపేట రాజరాజేశ్వర నాగాలయంలో ఈనెల 8న కొబ్బరికాయలు, పూజా సామగ్రి, లడ్డు పులిహోర, బెల్లం అమ్మకాల కోసం వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో విక్రమ్, అర్చకులు రాజేశ్వరశర్మలు మంగళవారం తెలిపారు.

ప్రత్యేక పారిశుధ్యంలో అందరూ భాగస్వామ్యులు కావాలి

సారంగాపూర్: గ్రామాల్లో చేపట్టనున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యులు కావాలని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. మంగళవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలపరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహణపై గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 7 నుంచి 15వరకు ప్రతి గ్రామంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీవో శశికుమార్‌రెడ్డి, ఏ. వెంకటకృష్ణ రాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

ఇబ్రహీంపట్నం: ప్రత్యేక పారిశుధ్య పనుల్లో భాగంగా నేటి నుంచి ఈ నెల 15 వరకు చేపట్టే పారిశుధ్య పనులపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో ప్రభు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామపంచాయతీల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రత్యేక పారిశుధ్య పనులను రోజువారిగా చేపట్టాల్సినవి వివరించారు.తహసీల్దార్ ప్రసాద్, ఎంపీవో కృపాకర్, అధికారులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు

కథలాపూర్: మండలంలోని బొమ్మెన, తాండ్రియాల, గంభీర్‌పూర్ గ్రామాల్లో కోరుట్ల పశు వైద్య కళాశాల, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్యశిబిరాలు నిర్వహించారు. 145 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు చేశారు. గర్భకోశ వ్యాధులకు సంబంధించి 276 పశువులకు చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజి రేవతి, పశు వైద్య కళాశాల అసోషియేట్ డీన్ మాధవరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటరు వైద్యాధికారులు, పశువైద్య డాక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.